న్యూజెర్సీ కథల పోటీలో

1,000 రూపాయిల బహుమతి పొందిన కథ

# తద్దినం

- ఎం. నిర్మల

ఆఫీసు పనిలో పూర్తిగా నిమగ్నమై పోయిన సుధాకర్‌కి ఎవరో చెప్పారు. "సార్! మీకో రిజిష్టరు కవరుంది" అంటూ. ఇంతలో పోస్ట్‌మేన్ రానే వచ్చాడు. సంతకం పెట్టి కవరు తీసుకున్నాడు సుధాకరం. ఇంత పెద్ద ఉత్తరమెవరు రాశారు చెప్మా అనుకుంటూ అడ్రసు చూశాడు. అమ్మ! ఈ మధ్యనే రెండు నెలల కిందట ఊరికి వెళ్ళి వచ్చాడు తను. ఇంతలోనే ఇంతపెద్ద ఉత్తరం. అందులోనూ రిజిష్టరు కవరు. ఆత్రుత ఆపుకోలేక కవరు చింపి ఉత్తరం బయటికి తీశాడు. అక్షరాల వెంట కళ్ళు పరుగు తీస్తున్నాయి.

"చి. సుధాకరాన్ని మీ అమ్మ దీవించి వ్రాయునది. నీకీ ఉత్తరం చేరేసరికి నేను మన ఊళ్ళో వుండను. ఎక్కడ వుంటాను అనేది నాకే తెలియదు. అసలు నీకి ఉత్తరం వ్రాస్తానని కానీ, వ్రాయవలసి వస్తుందని కానీ నేనెప్పుడూ అనుకోలేదు. చిన్నప్పటి నుండి నాకు మనుషుల మంచితనం మీద చెప్ప లేని నమ్మకం. అలాగే తెలిసి నేనెవరికీ చెడు చెయ్యలేదు. ఇంతకీ అసలు విషయానికి వస్తాను. వృద్ధాప్యంలో కొడుకులు, కోడళ్ళతో కలసి వుండాలని సాధారణంగా తలిదండ్రులు కోరుకుంటారు. కారణాలేమైతేనేంగాని ఈ రోజుల్లో అలా జరగడంలేదు. అందుకే మీరు నా దగ్గరలేరని కానీ, నేను మీ దగ్గర ఉండటం లేదని కానీ బాధ పడటంలేదు. దానికి నేను మిమ్మల్ని ఏమీ అనదలచుకోలేదు. మీ ఉద్యోగ రీత్యా మీరు దూరంగా వున్నారు. కాకపోయినా మీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకి నేను అడ్డురావాలని ఎప్పుడూ అనుకోలేదు. అందుకే మీ నాన్నగారు తిరిగిన ఈ ఇంట్లోనే నా జీవితం వెళ్ళిపోవాలనుకున్నాను. అసలు నాకీ ఒంటరి జీవితం వస్తుందని అనుకోలేదు. అసలు ఊహించను కూడా లేదు. నేను లేనిదే ఆయన వుండలేరనీ తెలుసు. మేమిద్దరమూ ఈ జీవితంనుండి ఒకేసారి తప్పుకోవాలని ఎంతో ఆశపడ్డాము. కానీ విధివక్రించి మీ నాన్నగారు ముందే వెళ్ళిపోయారు. మీరు నా దగ్గర లేకపోయినా, ఎవరి వీలు ప్రకారం వాళ్ళు వచ్చి వెళుతున్నారని సంతోషిస్తూ వచ్చాను. ఎవరు ఎప్పుడు వచ్చినా మీ నాన్నగారి ఆబ్దికానికి మాత్రం మీరిద్దరూ వస్తారు. మా మీద మీకున్న ఆపేక్షకి, అభిమానానికి నేనెంతో సంతోషించేదాన్ని. ఇంతపెద్ద ఉద్యోగాల్లో వుండి కూడా తల్లిదండ్రులపట్ల మీ బాధ్యతను మర్చిపోకుండా వున్నారని ఎంతో గర్వించేదాన్ని. కానీ మీ రాకలోని ఆంతర్యం మీరు పోయిన సారి వచ్చి వెళ్ళినప్పుడే అర్థమైపోయింది. అది తెలిసిన తరువాత నా గుండె తూటుపడింది. మీ నాన్నగారి మీద గౌరవాభిమానాలతోనూ, నా మీది ఆపేక్షతోనూ మీరిక్కడికి రావడం లేదనీ, ఇక్కడికి వచ్చినందువలన మీకూ, మీ భార్యలకూ బోలెడంత శ్రమతప్పుతోందనీ అర్థమైన తరువాత నా ఉనికికి అర్థం లేదని తెలిసి వచ్చింది."



ఉత్తరం సగం చదివిన సుధాకరానికి ఆ రోజు జరిగినవన్నీ గుర్తుకు వచ్చాయి.

వంటింట్లో తల్లి పొద్దుటినుండీ పడే అవస్థ తను చూస్తూనే వున్నాడు. వంట చేస్తూనే మధ్య మధ్యలో వీధిగుమ్మంకేసి చూస్తూ వుందావిడ. తమ్ముడికోసమని తనకు తెలుసు. ప్రతీ సంవత్సరం తమకిది అలవాటే. తను దూరం నుండిరావాలి కాబట్టి ఒకరోజు ముందే వస్తాడు. కానీ తమ్ముడు దివాకరం దగ్గర ఊళ్ళోనే వుంటాడు కాబట్టి ఆరోజు పొద్దున బయలుదేరి వస్తాడు. ఎప్పుడు వచ్చినా, భార్యా పిల్లలని తీసుకురాకుండా వస్తారని ఆవిడ బాధ. ఈ రకంగానైనా అందరూ ఒకరోజైనా కలసివుండాలని ఆవిడ ఆశ. ఒకరోజు భాగ్యానికి ఎందుకులే అని తాము అశ్రద్ధ చేస్తారు. తనకంటే దూరం. తమ్ముడికేమైంది. వాడు భార్యాపిల్లల్ని తీసుకు రావచ్చు కదా! ఏమో వాడిష్టం. ఎవరిష్టాలు వాళ్ళవి. ఆ రోజు సాయంత్రం తామిద్దరూ ప్రయాణ సన్నాహాల్లో వున్నారు. అప్పుడే దివాకరం అడిగాడు.

"ఒరే! ఒక్కరోజు కార్యక్రమంకోసం నువ్వు అంత దూరంనుంచి రాకపోతే ఏమైంది. అక్కడే ఏర్పాటు చేసుకోవచ్చుకదా."

నిజమే! కానీ తద్దినమంటే మాటలుకాదు. ఎన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. అక్కడంతా బిజీ. అయినా



12-5-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

సుధకి ఇంత పెద్దవంట చెయ్యటం కష్టం. వంట మనిషిని పెట్టాలంటే ఓ పట్టాన దొరకరు. దొరికినా బోలెడు డబ్బు అడుగుతారు. పిల్లల హడావిడితో ఇంతవంట చెయ్యాలంటే కష్టం. ఇక్కడైతే అమ్మ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. వంట సమస్య కూడా లేదు. అమ్మకి అలవాటే కాబట్టి ఆవిడ చేస్తుంది. ఊరికే మనం వచ్చి పని చూసుకుని వెళ్ళిపోతే సరిపోతుంది. అదే అన్నాడు తను. అప్పుడు తను మాత్రం ఊరుకున్నాడా. తమ్ముడు పిల్లల్ని మరదల్ని తీసుకు రాకుండా ఒంటరిగా వచ్చిన కారణం కూడా అడిగేశాడు. వాడు మాత్రం తక్కువ వాడా! పైకి చెప్పే కారణం ఒకటి. భార్యకు సెలవు దొరకలేదనీ, పిల్లలకి పరీక్షలనీ. కాని లోపలి ఉద్దేశం వేరు. తన భార్య తప్పించుకోగా లేనిది వాడి భార్య మాత్రం ఎందుకు తప్పించుకోకూడదని వాడి ఆలోచన. అమ్మ ఈ సంభాషణ విని వుంటుంది. అందుకే ఇలా ఉత్తరం వ్రాసింది. ఒక్క క్షణం అతని మనసు సిగ్గుతో చితికి పోయింది. నిజానికి తను అలా మాట్లాడకుండా వుండవలసింది. అమ్మ ఆశించిన సమాధానం వేరుగా వుండివుంటుంది. ఉత్తరంలోకి వెళ్ళాడు మళ్ళీ.

"నిజానికి మీరు ఇక్కడికి నా తృప్తి కోసం వస్తున్నారని జవాబు చెప్తి వున్నా ఎంతో సంతోషించేదాన్ని. ఎందుకంటే చనిపోయిన మీ నాన్నగారి మీద కాకపోయినా, బతికున్న నా తృప్తి కోసం ఆలోచిస్తున్నారని, కానీ మీ సుఖాలే తప్ప నా గురించిన ఆలోచన మీకు రాలేదు. ఇంతవయసు వచ్చిన అమ్మ ఎలా వంట చేస్తోందన్న ఇంగిత జ్ఞానం మీకు లేకపోయింది. ఓపిక లేకపోయినా నాన్నగారి మీద ప్రేమతో నేను చేస్తున్నానన్న ఆలోచన మీకు రాలేదు. కేవలం వంట మనిషి ఖర్చు తప్పిస్తున్నానన్న ఆలోచనే వచ్చింది. ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేముంది.

మా చిన్నతనపు రోజుల్లో మా పెద్ద వాళ్ళు ఇలా తద్దినాలు పెట్టాలంటే అధిక సంతానాలు, ఆర్థిక బాధలతో బతికున్న వాళ్ళకి తిండి పెట్టడమే కష్టంగా వుండి చనిపోయిన వాళ్ళకి తద్దినాలు పెట్టాలంటే ఖర్చు, శ్రమ అని బాధపడేవాళ్ళు. అయినప్పటికీ వాళ్ళు ఆచారాన్ని వదులుకోలేక ఎలాగో తంటాలు పడేవాళ్ళు. అయినా నాకు అప్పటికీ ఆశ్చర్యం వేసేది. కనిపెంచిన తల్లిదండ్రుల బాధ్యత నిర్వర్తించడానికి అంత ఆలోచిస్తారేమిటా అని. అందుకే మా శాయశక్తులా మీలో ఆప్యాయతలనీ, ప్రేమాభిమానాలను పెంచటానికే ప్రయత్నం చేశాము మేమిద్దరమూ! మీకు కష్టాలు తెలియకపోయినా జీవితంపట్ల సదవగాహన వుండేటట్లుగా పెంచామని తృప్తిపడుతూండే వాళ్ళం. కానీ, మా పెంపకంలో లోపమో, మీరు తిరిగే వాతావరణ ప్రభావమో గానీ మీలో మార్పు వచ్చింది. ఒకడికేమో అమ్మ అన్ని ఏర్పాట్లు చేస్తుంది మనం వెళ్ళి కాసేపు నిలబడితే చాలన్న ఆలోచన. కనీసం పురోహితుడికిచ్చే దక్షిణ తాంబూలాల గురించి కూడా ఆలోచించిన పాపాన పోలేదు మీరు. ఆ ఖర్చు కూడా అమ్మ చూసుకుంటుందని ధీమా! వాడు, వాడి భార్య సుఖపడగాలేనిది నాకు, నా భార్యకెందుకీ తద్దినమని రెండోవాడి ఉద్దేశం. ఎవరి భార్యలు కష్టపడటం వారికిష్టం వుండదు. అందుకే ఒంటరిగా వచ్చి పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతున్నారు. ఆర్థికంగా మీకిద్దరికీ ఏ బాధలూలేవు. పైగా మంచి ఉచ్ఛస్థితిలో కూడావున్నారు. అయినా మీ తండ్రి గురించి ఒక్కరోజు కష్టపడటానికి మీకు మనసు రాలేదు. అసలు తద్దినం ఉద్దేశం ఏమిటో తెలుసా? చనిపోయిన వారి పేరుతో ఒక్కరోజు ఇంత అన్నదానం చేస్తారనీ, కనీసం ఆ రోజైనా పెద్దలని తలుచుకుంటారనీ, అంతేకానీ తిట్టుకుంటూ ఎన్ని చేసినా ఎంతయధావిధిగా చేసినా ఫలితం వుండదు. వాళ్ళమీద ప్రేమతో ఒక మనిషికి తృప్తిగా భోజనం పెట్టినాచాలు. మనసులో లేకుండా ఎన్నిచేస్తే ఏం లాభం. మీ ఉద్దేశాలు తెలిసినాక ఇలాంటి కొడుకులున్నందుకు ఎలా గర్వించాలో అర్థం కావడం లేదు. సాధారణంగా పున్నామ నరకం నుండి తప్పిస్తారు కాబట్టి కొడుకులనే వాళ్ళు వుండాలని కోరుకుంటారు ఎవరైనా. మేమలా కోరుకోకపోయినా పుట్టిన మీ ఇద్దర్నీ ప్రేమగానే పెంచాము. మీ సంస్కారాలు అర్థమయ్యాక ఇక పున్నామ నరకం గురించి భయపడవలసిన అవసరం కనబడలేదు. అందుకే మీకీ శ్రమ తప్పించాలనే నేను మీ నాన్నగారు సంపాదించి ఇచ్చిన ఆస్తిలో ఇల్లు తప్ప మిగతాదంతా దేవాలయాలవాళ్ళు ఏర్పాటు చేసిన నిత్యాన్నదాన పథకానికి రాసిచ్చేశాను. పోతే ఇల్లొకటే వున్నది. దానిని మీకిద్దరికీ చెరిసగం ఇచ్చేశాను. అదివుంచుకుంటారో అమ్ముకుంటారో నాకనవసరం. నాకు నెలనెలా కొంత డబ్బు ముట్టే ఏర్పాటు చేసుకుని తీర్థయాత్రలకి వెళ్ళిపోతున్నాను. కొడుకులు కర్మకాండలు చెయ్యాలనీ తద్దినాలు పెట్టాలనీ నాకే కోరికా లేదు. ఆశించటమూలేదు. ఈ గుండె ఎప్పుడు ఆగిపోతే అప్పుడే శాశ్వత విశ్రాంతి తీసుకుంటాను. అప్పటి వరకు ఇలానిరంతర యాత్రలో....

వుంటాను
మీ అమ్మ"

◆



## స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న బొంబాయి ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ

ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న బొంబాయి మేయర్ శ్రీమతి నిర్మలసావంత్

బొంబాయిలో నివశిస్తున్న తెలుగువారి పిల్లలకు విద్యావకాశాలు కల్పిస్తూ ఎంతో సేవ చేస్తున్న ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలు జరుపుకుంటోంది.

శ్రీ పాతుని వెంకటనారాయణ కృషితో 1943 ఆగస్టు 15వ తేదీన ఏర్పడిన ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ దినదినాభివృద్ధి చెంది ఈ రోజున 3,400 మంది విద్యార్థులు, 120 మంది ఉపాధ్యాయులతో ప్రైమరీ స్థాయి నుంచి జూనియర్ కళాశాల స్థాయివరకు వివిధ కోర్సులలో తరగతులను నిర్వహిస్తోంది. ప్రస్తుతం కంప్యూటర్లు వున్న ఈ సొసైటీ ప్రైమరీ స్థాయి విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణనిస్తోంది. త్వరలో డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేసేందుకు ఈ సొసైటీ అధ్యక్షుడు శ్రీ కె. రామారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.కృష్ణారావు, బొంబాయిలో వున్న ఇతర తెలుగు ప్రముఖులు ఎంతగానో కృషి చేస్తున్నారు. ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవ కార్యక్రమాలను బొంబాయి నగర మేయర్ శ్రీమతి నిర్మల సావంత్ ప్రభావాల్కర్ ప్రారంభించారు.

ఈ నెలలో జరిగే స్వర్ణోత్సవ ప్రధాన వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ ఒక ప్రకటనలో తెలిపింది.